క్లుప్తంగా

డైమండ్ జూబ్లీ వేడుకలకు మద్దిపాడు హైస్కూల్ సిద్ధం

మద్దిపాడు: స్థానిక యాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. అదే క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 సంవత్సరాల లోకి అడుగుపెడుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పాఠశాల, జూనియర్ కళాశాల జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడానికి పాఠశాలను, కళాశాలను తీర్చిదిద్దుతున్నట్లు కళాశాల, పాఠశాల అధ్యాపక బృందం తెలిపారు. ఈ పాఠశాల నుంచి వేలాది మంది విద్యార్థులు చదువులు నేర్చుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నారని, పాఠశాల పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి ఆహ్వానితులేనని తెలిపారు. జూబ్లీ వేడుకలను దిగ్విజయం చేయాలని విద్యాసంస్థల సిబ్బంది తరఫున ఆహ్వానం పలికారు.

ప్రశంస పత్రాలు పొందిన ఉద్యోగులకు అభినందనలు



ప్రశంసపత్రాలు పొందిన వారిని అభినందిస్తున్న ఏకేయూ వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: గణతంత్ర దినోత్సవంలో ఆదివారం ఒంగోలులో కలెక్టరు తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ఉద్యోగులను సోమవారం అభినందించారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రామమోహనరావు, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టరు మండే హర్షప్రీతందేవ్‌కుమార్ అందించిన సేవలకు గుర్తింపుగా ప్రశంసపత్రాలు పొందారు. వీరిని సోమవారం ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ ప్రొఫెసర్ సోమశేఖర్, డాక్టరు కేవీఎస్ రాజు, డాక్టర్ అంచుల భారతీదేవి, డాక్టర్ పిల్లి వెంకటరావు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఎంపీడీవోకు సత్కారం



ఎంపీడీవో సురేష్‌బాబును సత్కరిస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబును సోమవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపి పట్టువస్త్రాలతో సత్కరించారు. సంతనూతలపాడు, మంగమూరు పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఒకటి, రెండు, మంగమూరు సచివాలయాల సిబ్బంది కలిసి సురేష్‌బాబును సత్కరించారు. మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఎం.రమణమ్మ, ఎంజీఎస్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన అధ్యక్షునిగా కళ్యాణ్‌రెడ్డి

సంతనూతలపాడు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీజేపీ సమావేశంలో మండల నూతన అధ్యక్షునిగా గుడిపాడు గ్రామానికి చెందిన బాలినేని కళ్యాణిరెడ్డిని నియమించారు. మండల మాజీ అధ్యక్షుడు తెలమేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు హాజరయ్యారు. మండల రిటర్నింగ్ అధికారి ట్యాగ్ర ఆధ్వర్యంలో గతంలో జరిగిన నామినేషన్ ప్రక్రియలో కేవలం కళ్యాణ్‌రెడ్డి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో అతన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాలినేని చెంచురెడ్డి, టుబాకో బోర్డు మెంబర్ పొద వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సంకే సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చీమకుర్తి మండలం నుంచి ఎక్కువ మంది పార్టీ నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు, స్థానికులు పాల్గొన్నారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు మొదటి ఫేజ్‌లో కూనంనేనివారిపాలెంలో అభివృద్ధి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు మొదటి ఫేజ్‌లో తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన బెంచీలు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడులో భాగంగా తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

నాడు కళకళ.. నేడు వెలవెల..!

- ప్రభుత్వ పాఠశాలలకు చంద్ర గ్రహణం
- నాడు-నేడు కార్యక్రమం కింద నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- కూటమి దెబ్బకు సర్కారు బడులు కుదేలు
- చీమకుర్తి మండలంలో వెలవెలబోతున్న 67 పాఠశాలలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి
- నేడు కళావిహీనంగా మారడంతో విద్యార్థులకు అవస్థలు

చీమకుర్తి రూరల్:

కూటమి ప్రభుత్వం దెబ్బకు చీమకుర్తి మండలంలో సర్కారు బడులు క్రమంగా కుదేలవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు.. ఇప్పుడు గాల్లో దీపాల్లా ఊగిసలాడుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు నెలలుగా ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో మండలంలోని పాఠశాలలు కళ కోల్పోయి పాతకాలం నాటి బడులను గుర్తుకుతెస్తున్నాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక ముందు ప్రభుత్వ పాఠశాలలు కళ కోల్పోయి ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలతో అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. ప్రధానంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు హంగులతో అభివృద్ధి చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లను తలదన్నేలా తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. దాంతో సర్కార్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రతి విద్యార్థికి బంగారు భవిష్యత్ అందేలా విద్యాబోధన చేస్తూనే విద్యార్థులకు ఇతర అవసరాల కోసం తల్లుల బ్యాంక్ అకౌంట్లలో అమ్మ ఒడి పథకం ద్వారా నేరుగా ఏటా రూ.15 వేల నగదు జమ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా విద్యార్థులకు అవసరమైన సామగ్రి మొత్తం అందజేసి ప్రతిరోజూ దర్జాగా వారు బడికి వెళ్లేలా వనరులు కల్పించారు. జగనన్న గోరుముద్దతో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించారు. నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ఉపాధ్యాయులపై పర్యవేక్షణ, నిఘా పెంచారు. సకల సౌకర్యాలు, క్రమశిక్షణకు మారుపేరుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్కార్ స్కూళ్లు కనిపించేవి. కానీ, కూటమి ప్రభుత్వం రాకతో అదంతా ఓ కలగా ప్రస్తుతం మిగిలిపోయింది. ప్రభుత్వ పాఠశాలలపై మళ్లీ నమ్మకం పోయింది. నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గతంలో కల్పించిన కనీస వసతులన్నీ పర్యవేక్షణ కరువై ఒక్కొక్కటిగా కనుమరుగయ్యాయి. విద్యార్థులను పాత సమస్యలన్నీ చుట్టుముట్టి వేధిస్తున్నాయి. దానికి తోడు తల్లికి వందనం అంటూ ఏకంగా ఎగనామం పెట్టడంతో తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏటా రూ.15 వేల చొప్పున నగదు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం మోసం చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సీఎం చంద్రబాబు తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.



బండ్లమూడి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు



పదమటినాయుడుపాలెం మండల ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు

చీమకుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు...	
మొత్తం పాఠశాలలు	67
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు	55
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	8
ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గరల్స్	1
ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ బాయ్స్	1
చీమకుర్తి ప్రభుత్వ పాఠశాల	1
ఏపీడీఈడీ పాఠశాల	1

చీమకుర్తి మండలంలో 10 శాతం పనులు కూడా పూర్తి చేయని కూటమి ప్రభుత్వం...

చీమకుర్తి మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమాల రెండు ఫేజ్‌లలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. మొదటి ఫేజ్‌లో రూ.6.82 కోట్లతో 30 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో ఫేజ్‌లో రూ.6.11 కోట్లతో 30 పాఠశాలలకు నిధులు మంజూరు చేశారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పరుగుల పెట్టించారు. గత ప్రభుత్వ హయంలోనే 90 శాతం పనులు పూర్తి చేశారు. 18-04-2024వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నిలిచిపోయిన మిగిలిన 10 శాతం పనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రగ్రహణం పట్టింది. ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పూర్తిగా సర్కార్ స్కూళ్లను గాలికి వదిలేసింది. మిగిలిపోయిన 10 శాతం పనులకు నిధులు మంజూరు చేస్తే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, అలా రాకూడదనే కుట్రతో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులను పూర్తిగా నిలిపివేసింది. ఫలితంగా పాఠశాలల్లో సమస్యలు పెరిగిపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. చీమకుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది విద్యార్థుల సంఖ్య 5,782 ఉండగా, ఈ ఏడాది 5,777కి తగ్గిపోయింది.

ప్రభుత్వ స్కూళ్లపై మళ్లీ నమ్మకం పోయింది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీట వేశారు. మాజీ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు పథకం క్రింద ఎంతగానో అభివృద్ధి చేశారు. అద్భుతమైన వనరులను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. నాణ్యమైన విద్య తో పాటు క్రమశిక్షణలో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు అదనపు తరగతి గదులు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోయింది.

– మోపూరి సుబ్బారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు, చీమకుర్తి

తల్లికి వందనం ఎగ్గొట్టారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ ఏటా రూ.15 వేలను తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు. కానీ, తల్లికి వందనం ఇవ్వలేమని సీఎం చంద్రబాబు ప్రకటించడం సమంజసం కాదు. అధికారంలోకి వచ్చాక మాట మార్చడం ప్రజలను మోసం చేయడమే.

– యన్నం విజయలక్ష్మి, ఎంపీటీసీ, బండ్లమూడి

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి
- ప్రధాన సమస్యలున్న రెండు శాఖల అధికారులు డుమ్మా
- సమస్యలపై ధ్వజమెత్తిన పలువురు ప్రజాప్రతినిధులు



శాఖల పనితీరుపై సమీక్షిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

నాగులుప్పలపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహాలక్ష్మి మాట్లాడుతూ మండల సమావేశంలో అందరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. సమావేశానికి వచ్చిన సభ్యులు, అధికారులు రికార్డులో సంతకం చేస్తేనే సమస్యలపై మాట్లాడాలని తెలిపారు. గ్రామాల్లో ప్రధానంగా ఎదుర్కొంటున్న విద్యుత్, రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. అదేవిధంగా గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్షించాల్సిన ఈవోపీఆర్డీ సమావేశానికి ఆలస్యంగా కాగా, ఆ శాఖపై ఎటువంటి సమీక్ష నిర్వహించకపోవడం వెనుక మతలబు ఏమిటో అర్థంగాని పరిస్థితి నెలకొంది. గోకులం షెడ్లు మంజూరు, డ్వాక్రా వీఓఏలను తొలగించడం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియడం లేదని, మా గ్రామంలో ఏం జరుగుతోందో చెప్పడం లేదని, ఇక మా తీర్మానాలు దేనికని, సమావేశం రికార్డుల్లో సంతకం పెట్టి ప్రయోజనం ఏమిటని తిమ్మసముద్రం ఎంపీటీసీ అశోక్‌బాబు ధ్వజమెత్తారు. దాంతో ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు.

వ్యవసాయాధికారి వెంకట్రావు, ఎంఈఓ రవి, పశుసంవర్ధశాఖ అధికారి జాస్మిన్, ఏపీఓ రవిబాబు, పంచాయతీరాజ్ అధికారి వీరాంజనేయులు, వెలుగు ఏపీఎం నరేంద్రకుమార్, హౌసింగ్ ఏఈ హేమలత వారి శాఖల ద్వారా జరుగుతున్న పనుల గురించి వివరించారు. మిగిలిన శాఖలపై కూడా వాడీవేడిగా చర్చ సాగింది. వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలందరూ కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలు నగరంలోని 16వ డివిజన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చుండూరు రవిబాబును ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై గ్రామస్థాయి నుంచే పోరాటం చేద్దామన్నారు. పేరుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, ఒక్క సమస్య కూడా పరిష్కరించిన దాఖలాలు లేవని విమర్శించారు. గ్రామస్థాయిలో సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్ర సంక్షేమంపై దృష్టి పెట్టకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కేసులతో ముందుకెళ్తోందని ధ్వజమెత్తారు. నగరంలోని డివిజన్లలో సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా పోరాడదామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు భాస్కర్, నాయకులు గణపతి, వీసం బుజ్జి, ప్రతాప్, రఘు, నంద్యాల సాయి, ఆర్ఎంపీ వెంకటేశ్వర్లు, పెద్దిపోగు కోటేశ్వరరావు, పులుసు సురేష్‌బాబు, దేవ, సన్నీ, సురేష్, సాయి సంజీవ్, వాణి, మేరీ, ప్రసన్న, రమణమ్మ, మాధవి, బెల్లంకొండ రమణమ్మ, మహిళా నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకాని అంజయ్యకు నివాళులు



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, కౌన్సిలర్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య బావ కాకాని అంజయ్య ఆదరణ కూడిక సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు కొమ్మూరి సుధాకర్ సోమవారం ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. త్రిపురాంతకం జెడ్పీటీసీ జాన్‌పాల్, చింతలపాలెం బాబు, పిన్నిక శ్రీనివాసరావు, కూడలి మాలకొండయ్య, దుడ్డు వెంకట్రావు, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను 3, 4 తరగతుల ఉద్యోగులుగా గుర్తించాలి

కొత్తపట్నం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను 3, 4 తరగతుల ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపట్నం, ఈతముక్కల సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కలిసి సోమవారం సంతకాలతో కూడిన పోస్ట్‌లెటర్లు తయారు చేశారు. ఈ సందర్భంగా స్వామిరెడ్డి మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రం హైకోర్టు ఆ రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులుగా గుర్తించాలని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు కూడా అదే తీర్పు ఇవ్వాలని, ఆంధ్ర రాష్ట్రంలోనూ అదే తీర్పు అమలు చేయాలని తామంతా సంతకాలు సేకరించి రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు పోస్ట్‌లెటర్లు సేకరించి పంపిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐక్యంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పశువుల్లో సంక్రమిత వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



చంద్రపాడులో గొర్రెలకు వైద్యం చేస్తున్న డాక్టర్ టి.మనురూప్



ఎనికపాడులో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

సంతనూతలపాడు: గొర్రెలు, మేకల్లో వచ్చే సంక్రమిత వ్యాధులపై వాటి పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలని ఒంగోలు పశువ్యాధి నిర్ధారణశాల సహాయ సంచాలకులు డాక్టర్ నాగర్జునబాబు సూచించారు. మండలంలోని ఎనికపాడు గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్జునబాబు మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు చేశారు. 3,100 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. 120 గేదెలు ఆవులు, ఎడ్లకు, 65 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. 30 గొర్రెలు, మేకలు, 21 గేదెలకు సాధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుపోషకులు, మేకలు, గొర్రెల పెంపకందారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రపాడు గ్రామంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని చంద్రపాడు గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పల్లామల్లి పశువైద్యాధికారి డాక్టర్ టి.మనురూప్ పాల్గొని 950 గొర్రెలు, మేకలకు, 13 దూడలకు, 30 ఆవులకు నట్టల నివారణకు వైద్యం చేశారు. 10 పశువులకు ఎదకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో చంద్రపాడు సచివాలయ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ ఎ.సునీల్, పలు గ్రామాల సచివాలయ పశుసంవర్థక అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొని సేవలందించారు.

కులగణన సాధనకు ఉద్యమిద్దాం



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు

చీమకుర్తి: బీసీ కులగణన సాధనకు బీసీ మైనారిటీ వర్గాలంతా ఏకమై ఉద్యమిద్దామని ఆయా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం చీమకుర్తిలో జరిగిన సమావేశంలో బీసీ కులగణన సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు, జిల్లా కమిటీ చైర్మన్ బొట్ల సుబ్బారావు పాల్గొని బీసీ కులగణన ఆవశ్యకతను వివరించారు. 1931లో కులగణన జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు జరగకపోవడం వలన బీసీ సామాజికవర్గానికి సంక్షేమ పథకాలు, ఉద్యోగాలలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఏకమై కులగణన సాధించుకునేందుకు ముందుకు సాగుదామన్నారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గ కులగణన సాధన కమిటీ అధ్యక్ష, కార్యదర్శిగా మర్రి లక్ష్మీనారాయణ, కరేటి నరసింహారావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి, పద్మశాలీయుల సంఘ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్రపు రాఘవ, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు పేరం సత్యం, బీసీ సంఘాల జిల్లా, రాష్ట్రస్థాయి సంఘాల నాయకులు కరేటి నరసింహారావు, షేక్ బాషా, పిన్నిక శ్రీనివాసరావు, డీ అప్పారావు, చల్లా శ్రీనివాసరావు, బీ ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పబ్లిక్ టాయిలెట్లకు మోక్షం

మద్దిపాడు: మండల కేంద్రంలోని ఆఫీస్ కాంప్లెక్స్‌లో 2016 సంవత్సరంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లు ఇంతవరకు ప్రారంభానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా పడి ఉన్నాయి. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో గతంలో కథనం ప్రచురితమైంది. టాయిలెట్ల నిర్వహణ ఎలా చేయాలో అర్థంగాక రూ.5 లక్షలతో నిర్మించిన టాయిలెట్లను 2016 నుంచి మూసివేశారు. ఈ నేపథ్యంలో మండల కార్యాలయాలకు వస్తున్న ఉద్యోగినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గమనించిన ఎంపీడీవో వి.జ్యోతి సుమారు 35 వేల రూపాయల వ్యయంతో టాయిలెట్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకొచ్చారు. అదేవిధంగా మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారుగా రూ.60 వేల ఖర్చుతో హ్యాండ్ బోర్‌ను ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అనుమతులతో ఏర్పాటు చేయించారు. విద్యార్థినులు వాడుక నీటి కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ఎంపీపీతో చర్చించినట్లు ఎంపీడీవో తెలిపారు. దీనిపై పలువురు మండల స్థాయి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపీడీవోకు అభినందనలు తెలియజేస్తున్నారు.



మండల కాంప్లెక్స్‌లోని పబ్లిక్ టాయిలెట్లు